క్లుప్తంగా

నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

పులివెందుల టౌన్ : స్థానిక రాణితోపు వద్ద గరండాల్ వంక బ్యూటిఫికేషన్‌లో భాగంగా కనంపల్లె వాటర్ స్కీం పైపులైన్‌ను షిఫ్టు చేస్తుండటంతో శుక్ర, శనివారాలు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని నారాయణ కళాశాల బ్యాక్‌సైడ్, ప్రశాంత్‌నగర్, సుజాత థియేటర్, సుభాకర్‌రెడ్డి కాలనీ, నాగులకట్ట, ఆర్టీసీ బస్టాండు సర్కిల్, దోబీఘాట్ బ్యాక్‌సైడ్, అంబకపల్లె మెయిన్ రోడ్డు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఓపెన్ ఫోరం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఓబుళమ్మ తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, మేట్లు, ఉపాధి హామీ కూలీలు హాజరుకావాలని ఆమె తెలిపారు.

చెన్నూరు తహసీల్దార్‌గా సరస్వతి



చెన్నూరు : మండల తహసీల్దార్‌గా సరస్వతి గురువారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఈమె పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో పఏరిపాలన అధికారిగా పనిచేస్తూ అక్కడినుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పఠాన్‌అలీఖాన్ కమలాపురం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నట్లు తెలిసింది. తహసీల్దార్ సరస్వతి కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులకు సంబంధించిన ఆన్‌లైన్, పాస్ పుస్తకాలు, భూ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని, అలాగే ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

నేడు గంధోత్సవం



విద్యుత్ దీపాలతో అలకరించిన దర్గా

జమ్మలమడుగు : పలగాడి సెంటర్‌లో వెలసిన హజరత్ సయ్యద్‌షా బడేగొస్‌పీరాఖాద్రీ ఉరుసు మహోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగే గంధోత్సవానికి దర్గాను అలంకరించారు. శుక్రవారం సాయంత్రం పురవీధుల గుండా గంధోత్సవ ఊరేగింపు జరుగుతుందన్నారు. శనివారం ఉరుసు సందర్భంగా రాత్రి గొప్ప ఖవ్వాలిపోటీ నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలలకు పుస్తకాలు సిద్ధం



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ క్రిష్టఫర్

జమ్మలమడుగు : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి కావలసిన పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓ క్రిష్టఫర్ తెలిపారు. గురువారం ఆయన కన్నెలూరులోని ఎమ్మార్సీకి నూతనంగా వచ్చిన పుస్తకాలను పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి కావలసిన పుస్తకాలతోపాటు విద్యార్థులకు షూ, బెల్టులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది 9వ తరగతి పుస్తకాలు మారుతుండటంతో ఈ పుస్తకాలు తప్ప మిగిలిన అన్ని తరగతులకు సంబంధించిన పుస్తకాలు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకెళ్లే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సూచించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

కమలాపురం : వీఎన్‌పల్లె మండలంలో ఈనెల 24వ తేదీ నుంచి జరిగే సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, పి.చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. గురువారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు నన్నే, వరప్రసాద్, మేరీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు మరో కాంస్యం

కడప ఎడ్యుకేషన్: ఉత్తరప్రదేశ్ గౌతమబుద్ధనగర్‌లోని గౌతమ బుద్ధ యూనివర్సిటీలో జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కడప యోగివేమన విశ్వ విద్యాలయానికి చెందిన రవిశంకర్ 81 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. రవిశంకర్ సాధించిన విజయానికి యోగివేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి, స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథ రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ రామసుబ్బారెడ్డి అభినందించారు.

చుక్కల భూములకు చిక్కులు లేవు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



చుక్కల భూములకు సంబంధించిన పత్రాలు పొందిన రైతులతో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్డీఓ

పెండ్లిమర్రి : ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ముగింపు పలుకుతూ చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల చిక్కులు తొలగించారు. దీంతో రైతన్నలకు భూమిపై భరోసా లభించిందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 2314 మంది రైతులకు సంబంధించి 3841 ఎకరాల చుక్కల భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం రైతులకు సంపూర్ణ హక్కును కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో 103 ఏళ్ల క్రితం భూ సర్వే జరిగినప్పుడు ప్రభుత్వ భూమి లేదా పట్టా భూమి అని నిర్ధారణ చేయకపోవడంతో రెవెన్యూ రికార్డులు(ఆర్ఎస్ఆర్)లో చుక్కలు పెట్టి వదిలేశారు. ఆభూములే చుక్కల భూములు అయ్యాయి. భూమిపై సంపూర్ణ హక్కులు లేక దశాబ్దాలుగా రైతులు ఆభూములును అనుభవిస్తున్నా వాటిని అమ్ముకునే స్వేచ్ఛ, సర్వ హక్కులు లేక ఇబ్బందులు పడ్డారు. సాగు చేసుకునే తమ భూములపై అధికారిక హక్కులు కల్పించాలని కాళ్లరిగేలా రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగారు. గత ప్రభుత్వాలు రైతుల సమస్యల గురించి పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులకు మేలు చేయాలని చుక్కల భూములకు చిక్కులు తొలగించారన్నారు. అనంతరం రైతులకు చుక్కల భూములకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, మండల స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ

చింతకొమ్మదిన్నె : నగర పరిధి 16వ డివిజన్‌లో చంద్రప్రతాప్‌రెడ్డి కాలనీలో రామాలయ నిర్మాణానికి గురువారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు టీటీడీ నుంచి నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, 16,17వ డివిజన్ ఇన్‌చార్జిలు నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, మట్లి శ్రీనివాసులురెడ్డి, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అమృత్ సరోవర్ పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న అధికారులు

వల్లూరు : మండల పరిధిలో అమృత్ సరోవర్ పథకం కింద చేపట్టిన పనులను ఇంజనీరింగ్ అధికారుల బృందం గురువారం తనిఖీ చేసింది. మండలంలోని ఏ ఓబాయపల్లె కుంట, లింగాయపల్లెలలో అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధి హామీ కూలీలు చేసిన పనులను డీఈఈ వెంకటాచలం, ఏడీఏ అనిత, సోషియల్ ఆడిట్ డీఆర్‌పీ అమరేశ్వర్ రెడ్డిలు పరిశీలించారు. ఇందులో భాగంగా కుంటలలో చేసిన పనులకు సంబంధించి రికార్డులను, కొలతలను తనిఖీ చేసి ఉపాధి కూలీలు, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారథి, ఈసీ అంజలి, క్లస్టర్ టీఏ శ్రీనివాసులు, టీఏలు రెడ్డెయ్య, శ్రీవాణి, ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

‘స్పందన’పై ప్రజలకు అవగాహన



ప్రజల అర్జీలను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

లింగాల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం అని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కామసముద్రం గ్రామంలోని సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ స్పందనపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూ సమస్యలు, ప్రభుత్వ పథకాల సమస్యలు ఉన్న వారు స్పందనలో అర్జీలను అందజేస్తే ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుని వెంటనే పరిష్కరిస్తారన్నారు. జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సచివాలయాలలో నిర్వహించే స్పందన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రామాంజనేయులు, మండలస్థాయి వివిధ శాఖల అధికారులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ల పంపిణీ తనిఖీ



పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించి పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పులివెందుల మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలపాలని వలంటీర్లకు ఆయన సూచించారు. అలాగే మిస్సమ్మ బంగ్లా సచివాలయంలో జరిగిన స్పందన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులు ఎలా స్పందిస్తున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయ ప్రతిష్ట పెంచేలా పనిచేద్దాం

కడప ఎడ్యుకేషన్: విశ్వ విద్యాలయం కీర్తి ప్రతిష్టలు పెంచేలా ప్రతి ఒక్కరం పనిచేద్దామంటూ వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ పిలుపునిచ్చారు. విశ్వ విద్యాలయ కుటుంబ సభ్యులంతా నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే వైవీయూను దేశంలోనే మొదటిస్థానానికి తీసుకువెళతామని అన్నారు. గురువారం విశ్వ విద్యాలయంలో పనిచేసే బోధనేతర సిబ్బందితో ఆయన స్థానిక సురభి సెమినార్ హాల్లో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో బోధనేతర సిబ్బందిలో 80 శాతం మంది డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత అర్హత కలవారు ఉండటం శుభ పరిణామం అన్నారు. విశ్వ విద్యాలయ విధానాలు రూప కల్పనలో మీ ప్రాత అంత్యంత కీలకమని అంతే బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని త్వరలోనే అమలులోకి తెస్తామన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహుని కల్యాణ వైభవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలోని మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు కూడా అభిషేకం చేసి వధూవరులుగా ప్రత్యేక అలంకారం నిర్వహించి ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చక బృందం కల్యాణ కార్యక్రమాన్ని క్రమంగా నిర్వహించింది. కల్యాణ అనంతరం అందులో వాడిన తలంబ్రాలను భక్తులందరికీ ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వారికి కల్యాణ భోజనాన్ని స్వామి, అమ్మవార్ల ప్రసాదంగా అందజేశారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం



విద్యార్థులకు రోగాల పట్ల అవగాహన కల్పిస్తున్న నరసింహులు

కమలాపురం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే 90 శాతం రోగాలు దరిచేరవని డీఎంహెచ్ఓ రిటైర్డ్ సూపరింటెండెంట్ నరసింహులు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా గురువారం ఆయన విద్యార్థులకు పరిసరాలు, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి నాగాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

భరోసా నగదు రైతుల ఖాతాలలో జమ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని 37,990 మంది రైతులకు రైతు భరోసాకింద రూ.28.616 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమచేసిందని గురువారం వ్యవసాయశాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత కింద జమ్మలమడుగు మండలంలో 4,877 మంది రైతులకు రూ.5500 చొప్పున రూ.3.674 కోట్లు, పెద్దముడియం మండలంలో 8,631 మంది రైతులకు రూ.6.501 కోట్లు, ఎర్రగుంట్ల మండలంలో 5,969 మంది రైతులకు రూ.4.496 కోట్లు, కొండాపురం 5,720 మందికి రూ.4.309 కోట్లు, ముద్దనూరు రూ.6,293 మందికి రూ.4.740 కోట్లు, మైలవరం 6500 మంది రైతులకు రూ.4.896 కోట్లు రైతుల ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ



దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న డీజీఎం కమలాకర్‌రావు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో గురువారం ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని యూసీఐఎల్ డీజీఎం కమలాకర్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో యూసీఐఎల్ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ బొగ్గుల సుగుణాథరెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఆ సంఘ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయ ఏఓకు గుండెపోటు

జమ్మలమడుగు : ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి అక్బాల్‌బాషాకు గురువారం గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా పడిపోవడంతో వెంటనే తోటి ఉద్యోగులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. వీఆర్‌ఏల సమస్యలతో కూడిన బహిరంగ లేఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖలో దాదాపు 2 వేల మంది వీఆర్‌ఏలుగా పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలకు రూ. 25,250 వేలు పెంచి పే స్కేలు అమలు చేయాలన్నారు. వీఆర్‌ఏల సంఘం నేతలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



ఓపెన్ ఫోరం నివేదికలు చదివి వినిపిస్తున్న సామాజిక తనిఖీ బృంద సభ్యుడు

కమలాపురం : ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ పథక ఏపీడీ నాగరత్నమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద జరిగిన ఓపెన్‌ఫోరంలో ఆమె మాట్లాడారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక బృందం చేపట్టిన తనిఖీ గురించి, అందులో బయట పడిన అంశాలను సభ్యులు చదివి వినిపించారు. ఏడాది కాలంలో ఉపాధితో పాటు అనుసంధాన శాఖలకు సంబంధించిన 864 పనులకు రూ.59.10 కోట్లు ఖర్చు అయినట్లు వారు వివరించారు. ఇందులో వేతనాల రూపంలో రూ.32.62 కోట్లు, మెటీరియల్‌కు రూ. 26.5 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. సామాజిక బృంద సభ్యులు గత నెల 22వ తేదీ నుంచి గ్రామాల్లో పర్యటించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ పనుల్లో రూ.19,842 సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఏపీడీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే క్షేత్ర స్థాయి సిబ్బంది కూలీలకు రూ.272 వేతనం పడే విధంగా కొలతలు వేసి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, అంబుడ్స్ పర్సన్ సాంబశివారెడ్డి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ భాస్కర్, పీఆర్ ఏఈ సుధాకర్‌రెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఏపీఓ అన్నా నాయక్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 15 కుటుంబాలు చేరిక



క్రిష్టియన్ మైనార్టీకి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : పట్టణంలోని ఎత్తపువారి కాలనీకి చెందిన క్రిష్టియన్ మైనార్టీకి చెందిన 15 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా క్రిష్టియన్ మైనార్టీ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి నిరుపేద లబ్ధిపొందుతుండటంతో పార్టీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్ జనర్ధాన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీసీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకోసం అసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కన్వీనర్ రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు, కమలాపురంలలో ఉన్న బాలుర వనిపెంట, వేంపల్లిలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న ఇంగ్లీషు మీడియంలో వివిధ కేటగిరిలలో ఖాళీగా ఉన్నసీట్ల కోసం దరఖాస్తులను చేసుకోవాలన్నారు. రెండు ఫొటోలతో ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులను ఆయా పాఠశాలలో అందజేయాలన్నారు. మైదుకూరు మండలం వనిపెంట గురుకుల పాఠశాలలో ఈనెల 11వ తేదీ 11 గంటలకు ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. పాఠశాలలో ఏయే కేటగిరి సీట్లు ఖాళీగా ఉన్నాయన్న విషయాన్ని ఆయా పాఠశాలల వద్దకు వెళ్లి తెలుసుకోవచ్చు అని సూచించారు. వివరాలకు 9010440416 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు అని సూచించారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ



వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

చక్రాయపేట : ఎస్సీ, ఎస్టీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన వేరుశనగ విత్తనాలు(లేపాక్షి రకం)ను గురువారం ఉచితంగా అందజేశారు. చక్రాయపేట మండలానికి 20 కిలోల బరువు గల 300 బస్తాల కాయలు వచ్చాయని వ్యవసాయాధికారి నవంత్ బాబు తెలిపారు. వీటిని కల్లూరుపల్లె తాండా, కుప్పం తాండా కుమార్లకాల్వ దళితవాడ రైతులకు ఎంపీపీ మాధవీ బాలకష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, పులివెందుల నియోజకవర్గం సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ బీసీ నేత గంగయ్యల చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఉదయరేఖ పాల్గొన్నారు.

పాగేరు వంకను శుభ్రం చేసిన ఎన్‌సీసీ కేడెట్స్

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కేడెట్స్ స్థానిక పాగేరు వంకను శుభ్ర పరిచారు. గురువారం పునీత్ సాగర్ అభ్యాన్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ కేడెట్స్ పాగేరు వంకలోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి ఎల్‌టీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటి వనరులను ప్రోత్సహించడానికి యువతను నిమగ్నం చేసే దిశగా ప్రయత్నాలను సమన్వయం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఎన్‌సీసీ కేడెట్స్‌ను కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి అభినందించారు.

దివ్యాంగ విద్యార్థులకు అధిక ప్రాధాన్యత




విద్యార్థులకు ఎంఆర్ కిట్లను అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె : దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు జిల్లా అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లె పట్టణంలోని భవిత కేంద్ర పాఠశాలలో చదువుతున్న 17 మందికి రూ.2.28 లక్షల విలువ గల బోధనోపకరణాలను ఎం.ఆర్. కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు బోధన ఉపకరణాలు ఒక వరం లాంటివని.. వీటిని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్త రమణమూర్తి, దశరథరామిరెడ్డి, నెల్లూరు సీఆర్పీ ప్రవీణ్‌కుమార్, ఐఈఆర్టీలు యశోధ, మమత, సిద్దారెడ్డి, విజయమ్మ, రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వివిధ శాఖల సమన్వయంతో బాల కార్మికులను గుర్తించి పునరావాసం కల్పించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి తేదీల వారీగా తనిఖీ చేయాల్సిన ప్రాంతాలను సూచించామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బాలలను పనిలో పెట్టుకోరాదని సూచించారు.

జ్ఞాపకాల అంచున పాత కలెక్టరేట్



పాత కలెక్టరేట్ భవనాన్ని ఓరుసుకుని ఉన్న చెట్టుకొమ్మలు

కడప కల్చరల్ : కడప నగరంలోని పాత కలెక్టరేట్‌కు చెట్టుకొమ్మల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. భవనం చుట్టూ పెరుగుతున్న కొమ్మలు నిర్మాణాలను ఒరుసుకుంటూ ఉండడంతో అది దెబ్బతినే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నగరానికి పాత కలెక్టరేట్ గర్వకారణమైనదిగా నిన్నటి వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలిచి ఉంది. వందేళ్లు పైబడడంతో కలెక్టరేట్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత భవనం ఆలనా పాలన లేక రోజురోజుకు శిథిలమవుతోంది. ఈ ప్రాంతమంతా సమీపంలోని వారికి మూత్రశాలగా మారిపోయింది. ప్రధాన గేటు నుంచి లోపలికి అడుగు పెట్టగానే తీవ్రమైన దుర్వాసన ఇబ్బంది కలిగిస్తోంది. పోలీసుస్టేషన్ సమీపంలోనే ఉండడంతో ప్రమాదాలకు గురైన వాహనాలు, కేసుల్లో తీసుకువచ్చిన వాహనాలు ఇక్కడే ఉంచుతుండడంతో వాటి మధ్యన చెత్త పేరుకుని దుర్గంధానికి కారణమవుతోంది. బిచ్చగాళ్లు, మద్యం ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాత కలెక్టరేట్ భవనం నిలయంగా మారింది. భవనం తూర్పువైపు భారీ చెట్టు కొమ్మలు రెండవ అంతస్తును ఒరుసుకుంటూ ఉండడంతో గాలి వచ్చినపుడు భవనం షన్‌షేడ్‌లు విరిగిపోతున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే భవన నిర్మాణ రాళ్లు కూడా తొలగిపోయే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకరంగా పరిణమించిన చెట్టు కొమ్మలను వెంటనే తొలగించి వీలైనంత వరకు పూర్తి స్థాయిలో భవనానికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు. జిల్లా మ్యూజియంగానో, గ్రామీణ వస్తువుల మ్యూజియంగానో, ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌గానో మార్చి భవనాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. పాత కలెక్టరేట్ భవనానికి అవసరమైన మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తెస్తే జిల్లాకు గర్వకారణమైన చారిత్రక నిర్మాణాన్ని కాపాడిన వారమవుతామని, అంత విలువైన భవనం రాయలసీమలో మరెక్కడా లేదని, దీన్ని వినియోగించకపోతే శిథిలమయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.